సునాయాస మరణం

రాత్రి మంచి నిద్రలో ఉండగా ఎవరో తట్టి లేపినట్లయి కళ్లు తెరిచాను. ఎదురుగా కళ్లు చెదిరే వెలుగు! ఆ వెలుగులోంచి ఓ దివ్యమంగళ రూపం క్రమంగా దగ్గిరగా వచ్చింది. ఆ రూపం దేముడా! దేముడిలాగే వున్నాడు మరి. పీతాంబరాలు, మెడలో మెరిసే వజ్రాల హారాలు – చేతులకి కంకణాలు నెత్తిన కిరీటం, వెనకాతల వెలుగుచక్రం, నిజంగా దేముడే – అమ్మో, నాకు దేముడు ప్రత్యక్షమయ్యాడు. 'దేముడూ.. నువ్వేనా, దేముడివేనా, నమ్మకం కుదరక అడిగాను. చిరునవ్వు నవ్వి అవును' అన్నాడు దేముడు.

"ఏ దేముడివి స్వామి, మెడలో పాము, నెత్తిన గంగ, త్రినేత్రం అవి లేవు కనక శివుడివి కావు – మురళి, ఫించం అవి లేవు కనుక కృష్ణుడివి కావు. నామాలు లేవు కనుక వెంకన్నవి కావు. సుదర్శన చక్రం లేదు విష్ణువ్వి కావు. మరే దేముడివి స్వామి"

"నువ్వెవరు అనుకుంటే ఆ దేముడినే – భక్తులు ఏ రూపం తల్చుకుంటే ఆ రూపం కనిపిస్తుంది" చిరునవ్వు నవ్వి అన్నాడు ఉబ్బితబ్బిబ్బు అయిపోతూ "నేనేం పుణ్యం చేశానని నాకు ప్రత్యక్షమయ్యావు దేముడూ" ఆనందం పట్టలేక అడిగా. "నీకు వరం ఇద్దామని వచ్చాను. ఓ వరం కోరుకో ప్రసాదిస్తాను" నవ్వుతూ అన్నాడు.

అమ్మో వరమే! వరాలిచ్చేటంత పుణ్యం ఏం చేశాను దేముడూ, నేనేం తీర్థయాత్రలు చెయ్యలేదు. గుళ్ళూ గోపురాల చుట్టూ తిరగలేదు. నోములు, వ్రతాలు, యాగాలు, యజ్ఞాలు, ఉపవాసాలు ఏమీ చెయ్యలేదు. మొక్కులు మొక్కి నోట్లకట్టలు హుండీలో వేయలేదు. దీపం పెట్టి రెండు నిమిషాలు దేముడికి దండం పెట్టుకోవడం తప్ప

నేనేం పూజలు చెయ్యలేదే స్వామీ" ఆశ్చర్యంగా అన్నా. "పూజలు వ్రతాలు చెయ్యనక్కర లేదు. ఈ మధ్య మంచి మనసుతో కాస్త దానాలు ధర్మాలు చేశావుగా అందుకని... 'తెల్లవోతూ చూశాను.' ఏమిటి ఆ కాస్తకే మీ దేముళ్లు వరాలిచ్చేస్తారా? తిరగేసి బోర్లేసి లెక్కేసినా ఓ ముప్ఫై వేలన్నాలేవు. అంతకే వరాలిచ్చేయడానికి వచ్చావా? ఆశ్చర్యానందాలతో అన్నాను.

"అంతేగా మరి. నీవే ఓ కవితలో రాశావుగా. 'చేసింది, యిచ్చింది ఊరికే పోదు, తిరిగి నీకే చెందుతుందని, మరి నీవిచ్చింది మళ్లీ నీకే దక్కాలిగదా' యిద్దామని వచ్చా.." అన్నాడు నవ్వుతూ.

"అంటే, ఓ ముప్ఫై వేల వరం యివ్వడానికి ప్రత్యేకం పనిగట్టుకి వచ్చావా ఆ మాత్రం నే సంపాదించుకోలేనా" కినుకగా అన్నాను. దేముడు చిరునవ్వు నవ్వి "ఆహా, అలాగా సంపాదించుకోగలవా?' అన్నారు. చటుక్కున నా పొరపాటు అర్థం అయింది". "సారీ, సారీ దేముడూ, శివుడాజ్ఞలేనిదే చీమైనా కుట్టదు గదా, నీదయ లేకపోతే ఓ రూపాయన్న సంపాదించలేం. ఏదో పత్రిక వాళ్లిచ్చే వందో రెండొందలలో కూడా రాకుండా చెయ్యకు. కాగితం, పోస్టు ఖర్చుకైనా వస్తుంది. అది సరేగాని, నేచేసిన యీ కాస్తదానం, ధర్మంకే వరం యిస్తానంటూ వచ్చావు. మరి లక్షలు లక్షలు కట్టలు కట్టి హుండీల్లో వేస్తుంటారు. కిలోలకొద్ది బంగారాలు, నగలు, హారాలు, కిరీటాలు యిచ్చేస్తుంటారు. యాగాలు, అన్నదానాలు చేసేస్తుంటారు. మరి వాళ్లందరికి ఎన్ని వరాలిస్తుంటావు స్వామీ..." సందేహంగా అన్నాను. 'కట్టలు కట్టలు డబ్బులిచ్చే వాళ్లకెందుకు ఇస్తాను. నిజాయితీగా, న్యాయంగా కష్టపడి సంపాదించిన దానిలో కాస్త యితరులకిస్తే అది దానం. ఎన్నికట్టలయినా నల్ల డబ్బు నే ముట్టుకోను...' దర్పంగా అన్నాడు.

"కబుర్లు చెప్పకు దేముడూ, ఆ డబ్బుతో చక్కగా పైనించి కిందవరకు వజ్రాల కిరీటాలు, రత్నాల హారాలు, బంగారు తొడుగులు... నిలువంతా బంగారం రత్నాలే కదా – ఆ డబ్బు నే ముట్టనని గొప్పలు చెప్తున్నావు – నిలేశాను.

"పెట్టుకోక ఏం చెయ్యమంటావు. రాతి విగ్రహాన్ని కదా, చేత్తో తీసి పారేయలేను గదా, భరించాలి. అక్కడకీ అప్పుడప్పుడు ఏదో వంకతో, కొన్ని అరిష్టాలని, ఇది అది వంకలు పూజారుల చేత చెప్పించి పెట్టుకోను. – మొన్న 'గాలి' గారిచ్చిన నలభైకోట్ల కిరీటం ముట్టుకున్నానా, అలాగే కొన్ని నగలు.. ఏదో భక్తుల సరదా.

రాతి విగ్రహాన్ని నగలతో అలంకరించి భక్తి చూపించి ముక్తి పొందాలనుకునే వారిని వారించి ప్రయోజనం లేదు. ఆ డబ్బు అన్నదానాలు, భక్తుల అవసరాలు తీరడానికి ఉపయోగపడ్తోంది కదా. నేనెందుకు కలిపించుకోడం – నిజాయితీగా భక్తిగా ఫలం, పుష్పం, తోయం చాలు మాకు. వారి వారి పాపాలు కడుగుకోడానికి ఏదో చేస్తుంటారు. అలాంటి వారి జోలికి నేను వెళ్లను. వివరణ యిచ్చాడు. ఆనందంతో తబ్బిబ్బు అయిపోయాను" అయితే నిజంగా నాకు వరం యిస్తావా" ఇంకా నమ్మకం కలగలేదు నాకు.

"మరి అందుకే గదా వచ్చాను. వరం కోరుకో... ఒక్కటే సుమా"

'ఏం వరం యిస్తావు. ఏం కోరుకోను...' సందేహంగా అడిగాను.

"నీ ఇష్టం వచ్చింది అడుగు, కాని ఒక చిన్న షరతు, ఏం కోరుకున్నా అది కేవలం నీకే ఉపయోగపడ్తుంది. నీకే వర్తిస్తుంది. మరెవరికి దక్కదు."

"మళ్లీ అదేం మెలిక 'పతి ప్రాణంబు దక్క' అని సావిత్రికి యముడు వరం యిచ్చినట్టు – మళ్లీ ఈ షరతేమిటి – '

"మరంతే – ఎవరెవరి ఖర్మ ఫలాలని బట్టి మంచైనా చెడైనా వారే అనుభవించాలి. ఏదన్నా వాళ్లు పొందగలిగిందే దక్కుతుంది. అప్పనంగా వచ్చేది కాదు.'

"ఏం వరం కోరుకోను?" అర్థం కాక ఆలోచించసాగాను.

"డబ్బు, బంగారం, యిల్లు... నీ యిష్టం..."

"సరే, అయితే ... ఓ పదికోట్లు... ఛా... ఛా... కోరుకునే దాకా వస్తే పది కోట్లేంటి ఓ వందకోట్లు ఇచ్చేయి. పిల్లలకి, మనవలకి అందరికి తలో పదికోట్లు యిచ్చి మిగతావి నాక్కావలసినవి కొనుక్కుని – కాస్త దానం ధర్మం...."

"ఇదిగో అమ్మా నీకేం చెప్పాను. ఈ వరంలో కోరుకున్నది నీకు మాత్రమే ఉపయోగపడ్తుంది అని."

"అంటే, నా తదనంతరమైనా పిల్లలకి దక్కదా – 'నిరాశగా అన్నా' మరి అలాంటప్పుడు ఇంత డబ్బు ఈ వయసులో ఏం చేసుకోను?'

"చూడు తల్లీ, పిల్లలకి కోట్లు కూడబెట్టి యిచ్చిన వాళ్ల గతి ఏమవుతుందో చూస్తున్నావుగా. పెన్షన్‌మీద బతుకుతున్న నీకు వందకోట్లెక్కడివి? దొంగ నోట్ల వ్యాపారమా అని నిన్ను నీ పిల్లలని పోలీసు స్టేషన్లు, కోర్టులు పేరు చెప్పి లాకప్‌లో

చిప్పకూడు తినిపిస్తే అది నీకు ఇష్టమా? అక్రమ సంపాదనల వాళ్లు పడుతున్న అవస్థలు చూసి కూడా అడుగుతున్నావా అంత డబ్బు."

"అదీ నిజమే. ఏదో ఉద్యోగాలు చేసుకు సంపాదించుకుంటూ సుఖంగా బతికే వాళ్లకి అనవసరమైన ఆశలు కల్పించి అవస్థలపాలు చేయడం ఎందుకు..."

"మరి ఇంత డబ్బు ఒక్కర్తివి ఏం చేస్తావు చెప్పు మరి..."

"ఆలోచనలో పడ్డాను. ఇంతంత బంగారం ముద్దలు కొని పడేస్తే! బోలెడు నగలు చేయించుకోవచ్చుగా.. నా మొహం, ఉన్న చంద్రహారాలు, పలకసర్లే ఎప్పుడూ వేసుకోలేదు. ఈ ముసలి వయసులో వంటినిండా నగలేం దిగేసుకుని ఏడుస్తాను. పిల్లలకివ్వడానికి లేదన్న షరతు లేకపోతే బాగుండు."

"పోనీ దేశదేశాలన్నీ చుట్టి రానా.. పాతిక ముప్పై ఏళ్ల క్రితం యూరప్, అమెరికా వెళ్లినప్పుడే ఆ ఏర్‌పోర్టులో గంటల వెయిటింగు, ఇరవై గంటల ప్రయాణం, ఏది చూడాలన్నా గంటలు గంటలు క్యూలో నిలబడలేక కాళ్లు పీక్కుపోయి, మైళ్ల కొద్ది నడిచి చూడాల్సిన ప్రదేశాలు... అమ్మో ఇవన్నీ చేసే ఓపిక యిప్పుడెక్కడిది నాకు వద్దుబాబూ..." నా ఆలోచన తెమలలేదు.

"ఏమిటి వరం కోరుకోడానికింతసేపా – తొందరగా చెప్పు. నీలాంటి వాళ్లు చాలా ముందున్నారు మరి."

"ఏం కోరుకుందామన్నా నాకొక్కర్తికే అన్నీ అని మెలిక పెట్టావు మరి – పోనీ ఏదో బతికినన్నాళ్లు హాయిగా వుండడానికి పెద్ద భవంతి, ఓ అందమైన తోట ఓ లోటస్ ప్యాలస్సో, మైసూర్ పేలస్సు లాంటిదో పెద్ద ఇల్లు ఇచ్చేయి. ఈ రెండు గదుల ఫ్లాట్ పిల్లలు వస్తే సరిపోవడం లేదు..." దేముడు నా మొహం చూసి నవ్వాడు.

"సరే ఇస్తాననుకో, మరి మెయిన్‌టైన్ చెయ్యగలవా, నీకొచ్చే పెన్షన్ డబ్బులతో కొంటెగా అన్నాడు. తెల్ల మొహం వేశాను" అదేమిటి ఇల్లు తోటలు ఇచ్చావంటే అన్నీ మెయిన్‌టైన్ నువ్వే చెయ్యాలి."

'అమ్మా ఆశ! ... అసలు ఒక్కటే వరం – కొసర్లుండవు – ' అల్లరిగా అన్నాడు.

'అయ్యబాబోయ్ అంత పెద్ద భవంతులు చూసుకోవాలంటే ఎంత మంది నౌకర్లు, చాకర్లు మాలీలుండాలి – నా బోడిపెన్షన్ తిండానికే సరిపోతుందిగా ఈ ఖర్చులు నా వల్ల అవుతాయా – పని మనిషి రాకపోతే రెండు గదుల కొంప తుడవడమే నా వల్ల కావడం లేదు. ఈ వయసులో, నావల్ల ఏం అవుతుంది. వద్దు బాబూ..."

"అబ్బ ఏమిటయ్యా నాయనా వరం యిస్తానని వచ్చి అన్నింటికీ నీవే అడ్డుపుల్లలు వేస్తున్నావు."

"అవును మరి. వరాలు యిచ్చేటప్పుడు మేమూ కాస్త జాగ్రత్తగా ఆలోచించాలని సావిత్రి కథ, భస్మాసురుడి కథల వల్ల తెలుసుకుని కాస్త జాగ్రత్త పడుతున్నాం. సావిత్రి మాటలతో యముడిని బోల్తా కొట్టించి మొగుడ్ని పట్టుకుపోయింది గదా. బోళాశంకరుడు వరమిచ్చి తనే చిక్కుల్లోపడ్డాడు గదా. నీకు ఓ వెయ్యి కోట్లిచ్చి, పెద్ద భవంతులు యిచ్చేస్తే ఇన్‌కంటాక్సు వాళ్ళూ, సిఐడి వాళ్ళు ఈ డబ్బు నేనిచ్చానని తెలిసి తిన్నగా నా దగ్గరికే వస్తే... నే చిక్కుల్లో పడను మరీ. అందుకే మరీ అంతంత గొప్ప వరాలు వద్దు కాస్త మామూలివి అడుగు.

"పోనీ కారు లేదు. ఓ పెద్ద కారిచ్చేయి. కాస్త మీటింగులకు వాటికి వెళ్లాలంటే ఈ ఆటోవాళ్లతో ఇబ్బందిగా ఉంది. పెద్ద పడవలాంటి కారు..." ఆశగా అడిగా - అంతలోనే అసలు తప్ప కొసర్లు లేవు అన్న దేముడి మాట గుర్తువచ్చి - 'అమ్మో - ఆ కారు పెట్రోలు, డ్రైవరు ఇవన్నీ భరించగలనా - ఈ హైదరాబాద్ రోడ్డు, ట్రాఫిక్కులో పడవలాంటి పెద్ద కారు - బాబోయ్ భరించే శక్తి నాకు లేదు.

"ఏమిటి ఆలోచన, కారడిగావు ఇవ్వనా..." "వద్దులే, నాకంత సీను లేదు" నిరాశగా అన్నా.

"మరయితే ఇంకేంకావాలి - ఒక వరం అడగడానికింత సేపా.

"ఏమిటయ్యా బాబూ. ఏం అడగాలో తెలిసి చావడం లేదు" తల పట్టుకున్నాను.

"అయితే సరే, నీకన్నీ ఉన్నాయి. ఉన్నదాంతో సుఖంగానే ఉన్నావు. మరి నే వెళ్ళిరానా..." దేముడు బయలుదేరబోయాడు.

"అయ్యయ్యో వెళ్లిపోకు దేముడూ.. ఉండు ఉండు ఆలోచించనీ... అయ్యో నా మతిమండా, మర్చేపోయాను, నేనో రచయిత్రిని కదా... 'కేంద్ర సాహిత్య అకాడమీ 'అవార్డు' ఛా... ఛా... కాదు కాదు అడిగే వరకు వస్తే జ్ఞానపీఠ అవార్డు అడిగేస్తే పోతుంది గదా..." దేముడూ గత ఏభై ఏళ్ల నుంచి సాహిత్య సేవ చేస్తున్నాను. కాని రావల్సినంత గుర్తింపు రాలేదని కాస్తంత బాధగా వుంది. నగలు, డబ్బు, మేడలు, కార్లు ఏం వద్దు గాని సాహిత్యంలో పెద్ద అవార్డు 'జ్ఞానపీఠ్' అవార్డు ప్రసాదించు. రచయిత్రిగా మంచి గుర్తింపు వస్తుంది."

దేముడు సూటిగా నా వంక చూసి చిరునవ్వు నవ్వి... 'సరే అలాగే, కాని

ఒక్కసారి నిజాయితీగా ఆలోచించు.. ఆ అవార్డు పుచ్చుకునేంత అర్హత నీకు ఉందనిపిస్తుందా' అవమానం ఫీలయిపోయాను. కోపంగా, పౌరుషంగా "ఏం ఎందుకు లేదు. ఏభై ఏళ్లుగా ఆపకుండా రాస్తున్నాను. మరీ చెత్త కాకుండా కాస్త ప్రయోజనకర సాహిత్యమే రాశాను. ఏం వచ్చినా వాళ్లందరూ ఏం ఊడబొడిచేశారు" సమర్ధించుకున్నాను.

"చూడమ్మా - అవార్డులు నిన్ను వెతుక్కుంటూ రావాలి గాని నీవు వాటి వెంట పడకూడదు. నీ ప్రతిభ గుర్తించితే అవార్డులు అవే వస్తాయి."

"అవన్నీ పాతమాటలు, ఇప్పుడు అడగందే అమ్మన్నా పెట్టదు. పైరవీలు చెయ్యాలి. 'మన' అనే వాళ్లున్న వారికే వస్తాయి. నిజంగా ప్రతిభ గుర్తించి ఇచ్చే రోజులు కావు.

"అవుననుకో - 'ఈవిడకింకా ఈ అవార్డు ఎందుకివ్వలేదు' అని జనం అనుకోవాలి గాని 'ఈవిడకెందుకీ అవార్డు ఇచ్చారు' అనిపించుకోకూడదు. ఇప్పుడు అవార్డు నీకు ఇచ్చాననుకో - అబ్బో, ఈవిడ దేముడినే మస్కాకొట్టి పైరవీచేసి అవార్డు సంపాదించుకుంది అనుకుంటే అది నీకు గౌరవమా ఆలోచించుకో."

"బాబూ, నీకో దండం, నాకీ వరాలు వద్దులే, వెళ్లు స్వామి... ఆ .. సరే.. ఎలాగో వచ్చావు. ఏదో బతికినన్నాళ్లు ఆరోగ్యంగా, మంచాన పడకుండా సునాయాస మరణం అన్నా ప్రసాదించు -" అన్నా విసుగ్గా.

దేముడు నవ్వాడు "అమ్మయ్య, ఇప్పటికి సరి అయిన దారికి వచ్చావు - చూడమ్మా ఈ వయసులో నీకు కోట్ల డబ్బు, బంగారాలు భవంతులు సుఖాన్నివ్వకపోగా ఉన్న మనశ్శాంతిని హరిస్తాయి. హాయిగా మనశ్శాంతిగా, ఆరోగ్యంగా బతకడం ముఖ్యం. నీవు కోరుకున్న సునాయాస మరణం కంటే నీకింకేం కావాలి ఈ వయసులో. నీకీ వరం ఇస్తున్నాను - తథాస్తు... 'చెయ్యెత్తి దీవించి వెనుదిరిగాడు. హఠాత్తుగా గుర్తొచ్చింది -' అయ్యో దేముడూ - ఆగు ఆగు సునాయాస మరణం ఎప్పుడో చెప్పకుండా వెళ్లిపోతున్నావేమిటి - 'గాభరాగా అడిగాను.' దేముడు తలతిప్పి నవ్వాడు.

"చూడు తల్లీ, చావు పుట్టుకల రహస్యం మీకు ముందే తెలిస్తే దేముడి ఉనికే మాయం అవుతుంది గదా, అయినా ఆ చిట్టావర్జలు యమధర్మరాజు దగ్గరుంటాయి."

"అలా కాదు స్వామి, ఆ సునాయాస మరణం నేననుకున్నప్పుడు రావాలి. అలా వరం ఇవ్వు."

"చెప్పాగా చావు పుట్టుకల నియంత్రణ మనిషి చేతికి వచ్చిననాడు మా మనుగడకే ముప్పు. అది మాత్రం అడక్కు..." అంటూ చెయ్యి ఊపి వెళ్లిపోయాడు.

"దేముడూ ... దేముడూ... అంటూ అరుస్తూ వెంటపడ్డాను... అయ్యో సునాయాస మరణం ఎప్పుడు? రేపా, నెల్లాళ్లకా, ఏడాదికా, పదేళ్లకా అయ్యో దేవుడూ ... చెప్పకుండా వెళ్లిపోతే ఎలా...?"

* * * * * *

"అమ్మా, అమ్మా..'పక్క గదిలో శలవుమీద వచ్చిన అబ్బాయి యోగా చేసుకుంటున్న నా కొడుకు వచ్చి నన్ను లేపుతూ – ' 'ఏమిటీ దేవుడూ అంటూ అరుస్తున్నావు. వాడెందుకు వస్తాడు ఇంత పొద్దుటే' అన్నాడు – మెలకువ వచ్చి లేచి కూర్చున్నాను.

"తప్పు తప్పు దేముణ్ణి వాడంటావేమిటి! 'మా వాడు తెల్లపోతూ' ఏ దేవుడు సంగతి నీవంటున్నది' అన్నాడు. దేవుడు అని ఓ పాత వాచ్‌మన్ అప్పుడప్పుడు వచ్చి మా ఇంట్లో మొక్కలపని, ఇంకేమన్నా పన్లుంటే వచ్చి చేసి పెడ్తుంటాడు. వాడనుకున్నా గాబోలు –

"అసలు దేముడురా – దేవుడు నాకు వరం యిస్తానని వచ్చాడు తెలుసా!"

"హో... హో... దేముడొచ్చి వరం ఇస్తానన్నాడా... ఏం వరం ఇచ్చేడేమిటి' హాస్యంగా అడిగాడు నవ్వుతూ.

"అలా నవ్వకు.. నిజంగానే వరం ఇచ్చాడు తెలుసా!... గర్వంగా అన్నా.

"ఇంతకీ ఏ వరం అడిగావు... ఓ లక్ష కోట్లు అడగక పోయారా, పది తరాలు కూర్చుని తినే వారం గదా – "పోనీ ఓ పెద్ద ఇల్లు ... వగైరాలడిగావా – ఏది డబ్బు గిబ్బు ఏం కనపడదేం. తరువాత పంపిస్తాడా..." సంభాషణ హాస్యంలోకి దించాడు.

"అబ్బ ఆగరా, దేముడు డబ్బు అవి ఇస్తే కేవలం నాకే ఉపయోగపడ్తుంది. ఏమిచ్చినా నా వరకే అన్న షరతు పెట్టాడు. మీకెవరికి ఉపయోగపడనప్పుడు అవన్నీ నేనేం చేసుకోను లేని పోని తలనొప్పి – అందుకని..."

"అందుకని మరి ఏం వరం అడిగావు" కుతూహలంగా అడిగాడు.

"సునాయాస మరణం అడిగా – మంచాన పడి ఎవరిచేత చేయించుకోకుండా, ఎవర్ని ఇబ్బంది పెట్టకుండా, నేను బాధపడకుండా వచ్చే మరణం కోరుకున్నా..."

"అబ్బ, ఎంత గొప్ప వరం కోరావు. పోనీ ఆ సునాయాస మరణం నీ చేతిలో వుంటుందటనా."

"అదేరా, అది సరిగా చెప్పకుండా వెళ్లిపోయాడు – ' దిగులుగా అన్నా.

"అడిగి అడిగి ఓ స్టుపిడ్ వరం అడిగావు" అన్నాడు. "ఏమిటి అలా అంటున్నావు.."

"ఆలోచించు నీకే అర్థం అవుతుంది" నవ్వుకుంటూ వెళ్లిపోయాడు.

అంటే ఆ సునాయాస మరణం ఏ క్షణాన వస్తుందోనని ప్రతిరోజూ ప్రతి గంట ప్రతి నిమిషం ఎదురుచూస్తూ బతకాలా! 'నీవున్నావా ఊడావా అని మేం రోజుకి పదిసార్లు ఫోనుచేసి అడుగుతుండాలా' అని వాడి ఉద్దేశం గాబోలు. రేపు 'నా కూతురు పైకి కిందికీ ఎన్నిసార్లు దిగి చూస్తుండాలి' అని విసుక్కుంటుందేమో! 'ఈవిడ పాలప్యాకట్టు, పేపరు తీసుకుందా అని పొద్దుటే చూస్తుండాలి కాబోలు అని పక్కింటి వాళ్లనుకుంటారేమో! ఆ సునాయాస మరణం నేను కోరుకున్నప్పుడు రావాలి అని అడగనందుకు తిట్టుకున్నాను. ముందు తెలిస్తే చక్కగా నా బంధువులని, స్నేహితులని, రచయితలని అందరిని పిలిచి హోటల్లో ఓ పెద్ద పార్టీ ఇచ్చి 'టా,టా, బై..బై.. వీడికోలూ' అని అందరి దగ్గిర శలవు తీసుకుని ... మంచి ముహూర్తం చూసుకుని పిల్లలని, మనవలని అందరిని పిలిచి అందరి సమక్షంలో సునాయాస మరణం పొందితే ఎంత బాగుంటుంది. వరం ఇస్తానని వచ్చి ఆదేముడు మరింత టెన్షన్‌లో పడేశాడు. మరి కాస్త దానాలు, ధర్మాలు చేస్తే మళ్లీ ఆ దేముడు ప్రత్యక్షం అయితే వరం నాకు కావల్సినట్టు మార్చమనాలి ఎలాగైనా!

ఏమిటో ఏ క్షణాన వుంటానో, ఊడుతానో – కాస్త టీవిలో స్క్రోలింగ్స్, న్యూస్‌పేపరు చూస్తుండండి (ఓ రచయిత్రిని కదా పేరు వేయరంటారా. మీరంతా ఎందుకైనా మంచిది టా.. టా... బై... బై... చెప్పేస్తున్నాను ఇప్పుడే.

(నీతి వాక్యం : వరాలు అడిగి లేనిపోని తలనొప్పులు వద్దు. ఏం ఇవ్వాలో, ఎప్పుడు ఇవ్వాలో దేముడికే తెలుసు అనుకోండి.)

(నవ్య, సెప్టెంబరు 5, 2012)